

కోవిడ్ నిబంధనలు పాటించాలి

విజయనగరం : ప్రతి ఒక్కరూ కోవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి హెచ్చరించారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో కోవిడ్ నిబంధనలు విధిగా పాటించాలని, ప్రతి ఒక్కరూ మాస్కు ధరించేలా ఆయా విభాగాధిపతులు చర్యలు తీసుకోవాలని గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆమె పేర్కొన్నారు. నాలుగో వేవ్ పై ప్రజలను అప్రమత్తం చేయటంలో కింది స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని శాఖల అధికారులు భాగస్వామ్యం కావాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు, ప్రజాసంఘాల సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకుల నుంచి సహాయం పొందాలని సూచించారు. సఖి గ్రూపుల సభ్యుల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ కోవిడ్ నాలుగో దశ ప్రమాదంపై ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఆరు మీటర్ల భౌతిక దూరం పాటించాలని, గుమిగూడరాదని హితవు పలికారు. ప్రతి ఒక్కరూ మాస్కు ధరించాలని, శానిటైజర్ వినియోగించాలని సూచించారు.

బస్తాల్లోకి ధాన్యం నింపుతున్న రైతులు

గోనె సంచుల సరఫరాలో అధికారుల మాటలు కోటలు దాటుతున్నా... ఆచరణ మాత్రం గడప దాటడం లేదు. నూర్పుచేసిన ధాన్యానికి పది రోజులుగా కల్లాల్లో కాపుగాస్తున్నా గోనె సంచులు సమకూర్చకపోవడమే ఇందుకు తార్కాణం. గోనె సంచులు అడిగితే లేవంటున్నారని, మరోవైపు ఎప్పుడు వర్షం కురుస్తుందోన్న బెంగతో కాలం వెల్లదీస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వణికే చలిలో కల్లాల్లో పడిగాపులు కాస్తున్నా ప్రభుత్వానికి, అధికారులకు కనికరం పుట్టడం లేదని విమర్శిస్తున్నారు. మరీ ఇంత నిర్లక్ష్యమా అంటూ మరికొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం గోనె సంచులు కావాల్సినన్ని ఉన్నాయంటూ బుకాయిస్తున్నారు.

ధాన్యం బస్తాలను అన్‌లోడ్ చేసేందుకు కొత్తబగ్గాం మిల్లు వద్ద వేచి ఉన్న ట్రాక్టర్లు

గోనె సంచులూ కరువే

- వాతావరణ మార్పు కంటతడి పెట్టిస్తోంది
- వణికే చలిలో కళ్లాల్లో పడిగాపులు కాస్తున్నాం
- మరీ ఇంత నిర్లక్ష్యమా?
- అధికారులవి కల్లబొల్లి మాటలు
- ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ తీరుపై అన్నదాత ఆవేదన

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/బొండపల్లి

ధాన్యం కొనుగోలు నత్తనడకన సాగుతున్న నేపథ్యంలో ప్రజాశక్తి ప్రతినిధుల బృందం బొండపల్లి, దత్తిరాజేరు, గజపతినగరం మండలాల్లో ప్రజాశక్తి క్షేత్ర స్థాయి పరిశీలన చేసింది. అధికార యంత్రాంగం నిర్లక్ష్యంతో రైతులు అడుగడుగునా అవస్థలు పడుతున్నారు. బొండపల్లి మండలం కెరటాం, నెలివాడ గ్రామాల పరిధిలో ఈ ఏడాది సుమారు 340 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఏడాది కాస్త వాతావరణం అనుకూలించడంతో దిగుబడి ఆశాజనకంగానే వచ్చింది. ఈ రెండు గ్రామాల్లో మొత్తం రైతులంతా నూర్పులు చేశారు. ఇప్పటి వరకు కేవలం 170మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు. గోనె సంచులు ఇవ్వకపోవడంతో మిగిలిన రైతుల ధాన్యం కల్లాల్లోనే ఉన్నాయి. దీంతో, రైతులు సచివాలయం వద్ద ఆర్‌బికె సిబ్బందిని నిలదీశారు. దీంతో, కెరటాం సచివాలయంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులతో సమావేశం నిర్వహించారు. గోనె సంచులు లేకపోవడం వల్ల కొంత ఆలస్యం జరుగుతుందని, ఇందుకు సహకరించాలని అగ్రికల్చర్ అసిస్టెంట్ సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. ఇంకా ఎన్నిరోజులు కల్లాల్లో పడిగాపులు కాయాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 100బస్తాల ధాన్యం విక్రయానికి సిద్ధంగా ఉంచి వారం రోజులు దాటుతోందని, ఇప్పటికీ సంచులు లేకపోవడంతో కల్లాల్లో రాసులుగా ఉండిపోయాయని మన్యాల సీతమ్మ, కృష్ణ ప్రజాశక్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదని అదే మండలంలోని బిల్లల వలసకు చెందిన గంట్యాడ తోటయ్య, దాలమ్మ దంపతులు ప్రజాశక్తికి చెప్పారు. సచివాలయం ఆధ్వర్యాన అసలు ధాన్యమే కొనుగోలు చేయడం లేదని, దీంతో, ప్రైవేటు వ్యాపారులకు విక్రయించుకోవాల్సి వస్తోందని దత్తిరాజేరు మండలం పాచలవలస, మరడాం తదితర గ్రామాలకు చెందిన రైతులు ఆక్రోసం వ్యక్తం చేశారు.

ఫోకస్

కళ్లంలోనే ధాన్యం

పది నుంచి వారం రోజులుగా ధాన్యం కల్లాల్లోనే ఉన్నాయని, చినుకుపడితే అరుగాలం కష్టపడి పండించిన పంట నీటి పాలవుతుందని ప్రజాశక్తి వెళ్లిన అన్ని గ్రామాల్లోనూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కెరటాంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను ప్రజాశక్తి ప్రశ్నించగా బొండపల్లి మండలంలో బ్యాంకు గ్యారెంటీలు చెల్లించిన మిల్లులు కేవలం మూడే మూడు (కెరాటం, గొట్లాం, బొండపల్లి గ్రామాల్లో) ఉన్నాయని, వాటి సామర్థ్యం తక్కువగా ఉండడం వల్ల అక్కడికి పంపిన సంచులు తిరిగి సకాలంలో రావడం లేదని స్పష్టం చేశారు. ఇదే విషయమై సివిల్ సప్లై అధికారులు దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇదిగో అదుగో అంటూనే పది రోజులు గడిపారని, దీంతో, కొద్దిరోజులుగా రైతులకు గోనె సంచులు సమకూర్చలేకపోతున్న మాట వాస్తవమేనని చెప్పారు. ఈ సమస్యతో దాదాపు అన్ని గ్రామాల్లోనూ ధాన్యపు రాసులు పోగై ఉన్నాయి. బస్తాకు 2కేజీల చొప్పున తరుగు పేరిట తీసుకుంటున్నారని కెరటాం, నెలివాడకు చెందిన పలువురు మహిళా రైతులు చెప్పారు. ఈ -క్రాప్ నమోదు కాకపోవడంతో చాలా మంది ప్రైవేటుగా విక్రయించుకోవాల్సిన దుస్థితి దాపురించింది.

ధాన్యం వద్ద కాపలా ఉన్న మహిళా రైతు దాలమ్మ

మిల్లుల వద్దే రోజుల తరబడి

గజపతినగరం మండలం పురిటిపెంట, గంగచోళ్లపెంట గ్రామాల్లో గోనె సంచులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరి చేలు నూర్పు చేసినప్పటికీ కల్లాల్లోనే ధాన్యం ఉండి పోవడంతో ఆవేదన చెందుతున్నారు. గోనె సంచుల కోసం వ్యవసాయశాఖ అధికారులను, ఆర్‌బికె సిబ్బందిని అడిగితే మిల్లుకు వెళ్లి కొనుక్కోవాలని చెబుతున్నారని పురిటిపెంటకు చెందిన దాసరి బంగారునాయుడు, సారికి అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాక్టర్‌తో మిల్లుకు తోలిన ధాన్యం సకాలంలో తూకం వేయక పోవడంతో కొత్తబగ్గాం వద్దగల లక్ష్మీ నర్సింహ రైసు మిల్లు వద్ద రోజుల తరబడి ఉండిపోవాల్సి వస్తోందని, దీంతో రవాణాఛార్జీ భారం పెరుగుతోందని రైతులు అంటున్నారు. క్వింటాకు నాలుగు కేజీలు వరకు అదనంగా తీసుకోవడం, గోనె సంచులు లేకపోవడం తదితర కారణాల వల్ల రైతులు దళారులకు క్వింటా రూ.1700 లేదా రూ.1800కు విక్రయిం చేస్తున్నారు.

గోనె సంచులకు వారం రోజులుగా తిరుగుతున్నాను

గోనె సంచుల కోసం వారం రోజులుగా సచివాలయానికి తిరుగుతున్నాం. ఇప్పటికే మిల్లులకు పంపిన ధాన్యం ఖాళీచేసి, వాటిని తీసుకొచ్చి ఇస్తామని చెబుతున్నారు. ఈలోపు వర్షం పడితే మా పరిస్థితి ఏమిటి? గింజలన్నీ మొలకొత్తడం లేదా నీటిలో కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడుతుంది. అధికారుల మాటలకు చేతలకు పొంతనలేదు. అవన్నీ కల్లబొల్లి మాటలే. కనీసం గోనె సంచులు కూడా సమకూర్చకపోతే ఇదేమి ప్రభుత్వం, వీరేం అధికారులు.

– చింతపల్లి రాజేశ్వరి, కెరటాం గ్రామం, బొండపల్లి మండలం

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వి.విజయలక్ష్మి

రూ.142 కోట్లతో కార్పొరేషన్ బడ్జెట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2023- 24 ఆర్థిక సంవత్సరానికి గాను నగరపాలక సంస్థ సుమారు రూ.142 కోట్ల అంచనా బడ్జెట్ కు స్టాండింగ్ కమిటీ తుది మెరుగులు దిద్ది ఆమోదం తెలిపింది. గురువారం నగరపాలక సంస్థ సమావేశం మందిరంలో స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. నగర మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 2023 - 24 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనపై సమాలోచనలు చేశారు. అన్ని ఖాతాపద్దుల కింద సాధారణ, మూలధనముల రాబడి సుమారు రూ.107 కోట్లకు గాను మొత్తం ఖర్చు సుమారు 142 కోట్లు, ముగింపు నిల్వ సుమారు రూ.14 కోట్లుగా అంచనా వేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగర అభివృద్ధి ధ్యేయంగా వార్షిక బడ్జెట్ ను అంచనా వేసినట్లు తెలిపారు. ఆదాయ మార్గాలను పెంచుకొని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు దృష్టి సారించాలని అన్నారు.నగరాభివృద్ధికి రూ.72 కోట్లు నిధులు కేటాయించగా, అందులో రూ.10కోట్లతో రహదారులు నిర్మించేందుకు, రూ.5.82 కోట్ల బిపిఎస్ నిధులతో అభివృద్ధి పనులు, రూ.10 కోట్ల ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు, కోటి రూపాయలతో సచివాలయాల పక్కా భవనాల నిర్మాణం, రెండు కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం, కోటి రూపాయలతో ఉద్యానవన వనాల అభివృద్ధి, మొక్కలు నాటి సుందరీ కరణ చేయడం, రూ.5 కోట్ల సాధారణ నిధులతో కాలువలు, కల్వర్టుల నిర్మాణం, కోటి 50 లక్షలతో సెంట్రల్ లైటింగ్, జంక్షన్ లైటింగ్ ల అభివృద్ధి, రూ.50లక్షలతో పార్కులు, క్రీడా ప్రాంగణాలు అభివృద్ధి, రూ.40 లక్షలతో సామాజిక మరుగుదొడ్ల అభివృద్ధి, కోటి యాభై లక్షలతో నీటి సరఫరా, పైపులైన్ల విస్తరణ, రూ.80 లక్షలతో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, కోటి రూపాయలతో అమృత పథకం 2 నిధులతో వివిధ అభివృద్ధి పనులు, రూ.9 కోట్ల తో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి సచివాలయ పరిధికి 20 లక్షల రూపాయల అబివృద్ధికి, కోటి రూపాయలతో వివిధ చోట్ల బోర్లు ఏర్పాటుకు బడ్జెట్లో కేటాయించినట్లు తెలిపారు.ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ మాట్లాడుతూ నగర అభివద్ధికి అధికారులు రూపొందించిన వార్షిక బడ్జెట్ అభినందనీయమని అన్నారు. బడ్జెట్ ప్రజావసరాలు మెరుగుపరిచేందుకు, నగరాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. సమావేశంలో కమిషనర్ ఆర్.శ్రీ రాములునాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు పట్నాన పైడిరాజు, పిన్నింటి కళావతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

చీకటి జిబలతో అడ్డుకోలేరు

టిడిపి ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

వైసిపి ప్రభుత్వం చీకటిజీవోలతో టిడిపిని అడ్డుకోలేదని ఆపార్టీ నాయకులు దుయ్యబట్టారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 1ను నిరసిస్తూ గురువారం అంబేద్కర్ జంక్షన్ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి అంబేద్కర్ విగ్రహానికిపూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జీవో కాపీని దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర పార్టీ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు కంది మురళి నాయుడు, కర్రోతు నర్సింగరావు, బొద్దల నర్సింగరావు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం కుప్పంలో చంద్రబాబు నాయుడు రోడ్ షో ను అడ్డుకునేందుకు తీసుకువచ్చిన జీవో దుర్మార్గమైన చర్యని అన్నారు. ఇది బ్రిటిష్ వారి కాలం నాటి 1861 జీవో అని, దాన్ని ఇప్పుడు అమలు చేస్తున్నారని విమర్శించారు. భారత రాజ్యాంగంలో ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా నివసించి తమ భావాలను తెలియపరిచే హక్కు ఉందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ఎక్కడా లేని విధంగా జీవో తీసుకొచ్చారన్నారు. ఈ జీవో వైసిపి ర్యాలీలలకు వర్తించదా అని ప్రశ్నించారు.కార్యక్రమంలో జిల్లా మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల.. నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

విజయనగరంకోట.. నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

శృంగవరపుకోట : వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 1ని రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.బి.ఎ.రాంప్రసాద్ ఆధ్వర్యాన దేవికూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి అందించారు. అనంతరం కూడలి నుంచి కాంప్లెక్సు వద్ద నల్ల బ్యాడ్జీలతో నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతి నిచ్చారు. అనంతరం కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన సాగిస్తున్నారా? లేక నియంతృత్వమా? అని ప్రశ్నించారు.

నెల్లిమర్ల: అధికార వైసిపి తీసుకు వచ్చిన చీకటి జీవో వెంటనే రద్దు చేయాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నం నాయుడు, రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజు, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్ర శేఖర్ రావు డిమాండ్ చేశారు. కుప్పం పర్యటనలో చంద్రబాబుపై అధికార వైసిపి దాడి, చికటీ జీవోకు నిరసనగా టిడిపి శ్రేణులు గురువారం స్థానిక రామతీర్థం జంక్షన్‌లో ధర్నా నిర్వహించి నిరశన వ్యక్తం చేశారు. ముందు ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కి తరలించారు.

కార్యక్రమంలో సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, నాయకులు లెంక అప్పల నాయుడు, పతివాడ అప్పలనాయుడు, బైరెడ్డి లీలావతి, అవనాపు సత్య నారాయణ, కాళ్ళ రాజశేఖర్, కింతాడ కళావతి, కాళ్ళ లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

తుప్పల్లో పసికందు మృతదేహం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బొద్దాం పంచాయతీ పరిధిలోని కొత్తబొద్దాం గెడ్డ వద్ద తుప్పల్లో గురువారం పసికందు మృతదేహం లభ్యమైంది. పసికందును ఆ గ్రామానికి చెందిన భూసాల మంగమ్మ చూసి, విఆర్‌ఒ గుడివాడ అప్పలరాముకు సమాచార మిచ్చారు. వెంటనే ఆయన వల్లంపూడి పోలీసులకు తెలియ జేయడంతో ఎస్‌ఐ రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. శిశువు మృతదేహాన్ని ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పసికందు మృతదేహం

22 మందికి కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి -విజయనగరం కోట

ఆర్‌టిసిలో ఉద్యోగం చేస్తూ మరణించిన. వారి వారసులు 22 మందిని సచివాలయాలకు కేటాయిస్తూ కారుణ్య నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ ఎ. సూర్య కుమారి గురువారం అందజేశారు. వీరిలో 10 మందిని వెల్ఫేర్ అసిస్టెంట్లుగా, మిగిలిన వారిని పంచాయతీ కార్యదర్శులుగా, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లుగా నియ మించారు. ఈ ఉత్తర్వులను డిఆర్‌ఒ గణపతిరావు తన ఛాంబర్‌లో అభ్యర్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ అంకితభావంతో పనిచేసి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ శేషశైలజ

పారదర్శకంగా భూ రికార్డులు

ఆర్‌డిఒ శేషశైలజ

ప్రజాశక్తి-రామభద్రపురం

సమగ్ర భూ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు పారదర్శకంగా భూ రికార్డులు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్‌డిఒ శేషశైలజ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం సమగ్ర భూ సర్వే నమోదు వివరాల తహశీల్దార్ గణపతిరావును అడిగి తెలుసుకున్నారు. భూ సర్వే సంబంధిత రైతుల సమక్షంలోనే జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొన్ని చోట్ల విస్తీర్ణం, సర్వే నంబర్ వంటివి తప్పుగా నమోదు అవుతున్నట్లు సమాచారం వస్తుందని చెప్పారు. వీటిపై రైతులు ఆందోళన చెందకుండా అలా తప్పుగా నమోదైన వివరాలు అందజేస్తే వాటిని మార్పు చేసి ఇస్తామన్నారు. డివిజన్ పరిధిలో 273 రెవెన్యూ గ్రామాలకు గాను నేటివరకు సుమారు 100 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశామన్నారు. ాకార్యక్రమంలో తహశీల్దార్ గణపతిరావు, ఆర్‌ఐ భాను, సిబ్బంది పాల్గొన్నారు.

12న జాతీయ యువజన దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 12న జాతీయ యువజన దినోత్సవం నిర్వహించనున్నట్లు సెట్విజ్ సిఇఒ ఎస్‌వికె దుర్గాప్రసాద్ తెలిపారు. గురువారం లెండి ఇంజినీరింగ్ కళాశాలలో వ్యాస రచన, వక్తృత్వ పోటీలు, డిబేట్, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కబడ్డీ, ఖోఖో, వాలీ బాల్ పోటీలు నిర్వహించామన్నారు.

జాతీయ స్థాయి వర్క్‌షాప్‌కు జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి-విజయనగరం

మండల, జిల్లా స్థాయి అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ ఢిల్లీలో గురు, శుక్రవారాల్లో నిర్వహస్తున్న జాతీయ స్థాయి కార్యశాలకు జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరయ్యారు. దేశ రాజధాని న్యూఢిల్లీలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో ఈ రెండు రోజుల వర్క్ షాప్ జరుగుతోంది. మండలాలు, జిల్లాల అభివృద్ధికి ప్రాజెక్టు ఆధారిత అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన అనే అంశంపై రెండు రోజులపాటు వివిధ రంగాల నిపుణులు పాల్గొని పలు అంశాలపై చర్చిస్తారు. మన రాష్ట్రం తరపున జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సహా పలువురు జిల్లాపరిషత్ ఛైర్మన్‌లు ఈ వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయమంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్, కార్యదర్శి సునీల్ కుమార్, సంయుక్త కార్యదర్శి అలోక్ ప్రేమ్ నాగర్ తదితరులు ప్రారంభోపన్యాసం చేశారు. వర్క్ షాప్‌లో జిల్లా పరిషత్ ఇన్‌ఛార్జి సిఇఒ కె.రాజ్ కుమార్ కూడా పాల్గొన్నారు. మండల, జిల్లాపరిషత్‌ల అభివృద్ధికి నిధుల విడుదల తదితర అంశాలపై జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కేంద్ర పంచాయతీరాజ్ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్‌ను కలసి చర్చించారు.

కేంద్రమంత్రితో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

కల్వర్టును ఢీకొన్న లారీ

4 గంటలు ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి-లక్కవరపుకోట/వేపాడ

బొద్దాం నుంచి విశాఖపట్నం వెళ్తున్న లారీ గురువారం తెల్లవారుజామున మండలంలోని సోంపురం జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి కల్వర్టును ఢీకొంది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో రెప్పపాటులో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం.. గోల్డ్ స్టార్ జంక్షన్ సమీపంలో ఉన్న స్టీల్ ఎక్స్ఛేంజ్ పరిశ్రమలో లోడ్ చేయించుకుని విశాఖపట్నం వెళ్లేందుకు బొద్దాం నుంచి లారీ బయల్దేరింది. విశాఖపట్నం నుంచి అరకు వైపు వెళ్తున్న ఇన్నోవా కారును తప్పించబోయి కల్వర్టును ఢీకొంది. దీంతో కల్వర్టు రక్షణగోడ పడిపోయింది. కారును ఢీకొట్టకుండా... గెడ్డలో లారీ పడకుండా... లారీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించాడు.

ట్రాఫిక్ జామ్

కల్వర్టు రక్షణగోడను ఢీకొని లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. దీంతో అరకు- విశాఖ మార్గంలో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఘటనా స్థలానికి లక్కవరపుకోట పోలీసులు చేరుకుని క్రేన్‌ని రప్పించారు. ఉదయం ఏడు గంటల సమయంలో లారీని పక్కకు తీయడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. నాలుగు గంటల పాటు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ప్రమాదానికి గురైన లారీ

కాలువ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 26వ డివిజన్ జొన్న గుడ్డి, ఎలుగుబంటి వారి వీధి, కోరాడ వీధి ప్రాంతాలలో రూ.38.35 లక్షలతో నిర్మించునున్న కాలువలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌ఛార్జి గుజ్జల నారాయణరావు, స్థానిక నాయకులు యవర్ణ కుమారస్వామి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. శంకుస్థాపనలు చేయడమే కాకుండా నిర్ణీత కాలంలో అవి పూర్తి అయ్యేవిధంగా కషిచేసి ప్రారంభోత్సవాలు కూడా చేయడం విశేషం అన్నారు. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని తక్షణం పరిష్కరించేందుకు సాయ శక్తుల కషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పూసల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

'యువశక్తి'సభలో గళం విప్పేందుకు పేర్లు నమోదు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఈనెల 12న రణస్థలంలో జరిగే యువశక్తి సభలో మాట్లాడేందుకు తమ పేర్లును నమోదు చేసుకోవాలని జనసేన నాయకులు గురాన అయ్యలు తెలిపారు. దీనికోసం జనసేనపార్టీ ప్రత్యేక ఫోన్ నెంబర్, ఈ మెయిల్ ఐడి కేటాయించినట్లు తెలిపారు. ఫోన్ నంబరు 080 69932222, vrwithjspk@janasenaparty.org సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. గురువారం స్థానిక జిఎస్‌ఆర్ కాంప్లెక్స్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 5వ తేదీ నుంచి 8వ తేదీలోపు యువతీ యువకులు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. వాయిస్ రికార్డర్ ద్వారా పని చేసే ఈ ఫోన్ నంబరులో యువతీ యువకులు ఏ అంశం మీద మాట్లాడాలి అనుకుంటున్నారో క్లుప్తంగా వాయిస్ రికార్డు చేసి చెప్పవచ్చుని తెలిపారు. ప్రతిపక్షపార్టీల గొంతు వినిపించకూడదు, ఆ పార్టీలు కార్యక్రమాలు నిర్వహించకూడదు అనే ఉద్దేశంతోనే వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 1ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బహిరంగ సభ పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో ఆదాడ మోహన్‌రావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద జైనుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జైనుల పవిత్ర ప్రార్థనా స్థలమైన సమ్మేద్ షికార్జీని పర్యాటక కేంద్రంగా పరిగణిస్తూ ఝార్ఖండ్ ప్రభుత్వం జారీ చేసిన జీవోను తక్షణం ఉపసంహరి ంచుకోవాలని గురువారం నగరంలో జైనులు కదంతొక్కారు. జాతీయస్థాయిలో జరుగుతున్న ఆందోళనలో భాగంగా జైన్ సంఘ్ ఆధ్వర్యంలో జైన మతానికి చెందిన ప్రతినిధులు, మహిళలతో సహా వందలాదిమంది భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ ఆందోళనను ఉద్దేశించి జైన్ సంఘ్ ప్రతినిధులు ప్రవీణ్ అంచాలియ, జ్యోతి బచావత్ మాట్లాడారు.

కళాసీల సమ్మెకు మద్దతు ఇవ్వండి

బొబ్బిలి : షాపులలో పని చేసే కళాసీల సమ్మెకు ప్రజలు మద్దతు ఇవ్వాలని పట్టణ కళాసీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.అప్పలస్వామి, డి.వర్మ కోరారు. కళాసీ సంఘం కార్యాలయంలో సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరుతూ గురువారం ప్రచార పత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాసీ ఛార్జీలు వల్ల ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను దృష్టిలో పెట్టుకుని వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. రామభద్రపురంలో వేతనాలకు కళాసీలు పనిచేస్తున్నారని, పట్టణంలో కూడా వేతనాలకు పని ఇవ్వడంతో వ్యాపారులు సిద్ధమైతే తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. వేతన ఒప్పందం చేయపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాసీ సంఘం నాయకులు అప్పారావు పాల్గొన్నారు.

చీకటి జిఒను రద్దు చేయాలి : టిడిపి

రామభద్రపురం : ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, ప్రతిపక్ష పార్టీలను అణగదొక్కాలనే తీసుకు వచ్చిన చీకటి జిఒను వెంటనే రద్దు చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి చింతల రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం మండల నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సభలకు వస్తున్న జన సునామీని చూసి ఓర్వలేక జిఒ 1ని తీసుకు వచ్చారని ఎద్దేవాచేశారు. కందుకూరు, గుంటూరు సంఘటనలు అధికార పార్టీ ఆగడాల వల్లే జరిగినట్టు అనుమానం ఉందన్నారు. చంద్రబాబు కుప్పం పర్యటనలో పోలీసుల తీరు యావత్ ప్రజానీకం గమనిస్తున్నారని, దీనికి ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. నారా లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు విజయభాస్కర్, నాయకులు చిన్నమ్మ తల్లి, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి

రేగిడి : పదో తరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు కృషి చేయాలని బొబ్బిలి డివిజన్ డిప్యూటీ డిఇఒ నల్ల తిరుమలనాయుడు సూచించారు. గురువారం అంబాడ వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు చేపట్టాలని హెచ్ఎం ఆర్.వి.జి.ఎం మురళీకృష్ణకు సూచించారు. సర్పంచ్ చుక్క వెంకటి నాయుడు, వైసిపి నాయకులు వేణు నాయుడు, ఎస్ఎంసి ఛైర్మన్ మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య ఎక్కువ కారణంగా జూనియర్ కళాశాల మంజూరు చేయాలని కోరారు.

వంగర: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను మరింత బలోపేతం చేయాలని డిప్యూటీ డిఇఒ తిరుమల నాయుడు అన్నారు. మండలంలోని మరువాడ, కొనంగిపాడు పాఠశాలలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా 5వ తరగతి విద్యార్థులతో చదివించి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ప్రధాన ఉపాధ్యాయులు జిల్లా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సన్యాసిరాజు, ఎంఇఒ దుర్గారావు, హెచ్ఎం కొప్పర శ్రీనివాసరావు, బి. ఎరకయ్య పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా

బొబ్బిలి : రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా విధించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు.. సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని నాయుడు కాలనీ, ఫైవ్‌రోడ్ ప్రాంతంలో పారిశుధ్య పనులను గురువారం ఆయన పరిశీలించారు. రోడ్డు, కాలువల్లో చెత్త వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందించాలని స్థానికులను ఆయన కోరారు. మెకానిక్ షాపు యజమాని రోడ్డుపై చెత్త వేయడంతో రూ.వెయ్యి జరిమానా విధించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ అనుపమ పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

వేపాడ : మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ గురువారం సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించేందుకు పలు ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు.

మాదకద్రవ్యాలతో అనర్థం

బొబ్బిలి : మాదక ద్రవ్యాలతో అనర్థాలు తప్పవని ఎస్ఇబి సిఐ జైభీమ్ హెచ్చరించారు. స్థానిక ఎస్ఇబి కార్యాలయంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన పోస్టర్లను గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణ చర్యలలో భాగంగా యువత, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

కాలుష్యంపై పోలీసులకు ఫిర్యాదు

కొత్తవలస : కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలని బిఎస్‌పి విశాఖ జిల్లా అధ్యక్షులు బోను కృష్ణ, ఎస్.కోట నియోజకవర్గ అధ్యక్షులు కోట వెంకటరావు, నాయకులు అప్పారావు స్థానిక స్టేషన్‌లో సిఐ బాలసూర్యారావుకు ఫిర్యాదుచేశారు. గురువారం బిఎస్‌పి నాయకులు మండలంలో పర్యటించి కాలుష్యం పరిస్థితిపై తెలుసుకున్నారు. కంటకాపల్లి రైల్వే స్టేషన్ నుంచి గ్రామం మీదుగా బొగ్గు లోడ్లతో భారీ లారీలు నిరంతరం తిరగడంతో రహదారి పొడవునా గుంతలు, నల్లని బూడిద ఉండటంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనివల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. కంటకాపల్లి నుంచి కొత్తవలస, చింతలపాలెం వరకూ రోడ్లకిరువైపులా ఉన్న ఇళ్ళు, ప్రభుత్వ కార్యాలయాల్లో నల్లని బూడిద దర్శనమిస్తోందని సిఐ దృష్టికి తీసుకెళ్లారు.

మాజీ మంత్రి పుట్టినరోజుకు ఏర్పాట్లు

రాజాం : ఈ నెల 8వ తేదీన మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించనున్నామని రాజాం టౌన్ టిడిపి ప్రధాన కార్యదర్శి శాసపు రమేష్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో టౌన్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ టంకాల కన్నంనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 7న పాలకొండ రోడ్డులోని మోర్‌కి ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. 8న అనేక సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో బిసి సెల్ కార్యదర్శి పిల్లా సత్యంనాయుడు ఉన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో సభలకు అనుమతి

పూసపాటిరేగ : జిఒ నెంబర్1లో బహిరంగ ప్రదేశాల్లో అనుమతులు తీసుకొని సమావేశాలు నిర్వహించుకోవచ్చని చెప్పడం టిడిపి గొంతు నొక్కడమా? అని ఎంపిపి మహంతి కళ్యాణి ప్రశ్నించారు. ఆమె చాంబర్‌లో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబుకు వస్తున్న ప్రజాదరణ చూడలేకే జిఒ ఇచ్చారంటూ టిడిపి నేతలు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమన్నారు. వాపును బలుపులా చూపించుకోవాలని అనుకుంటున్న టిడిపి నేతలు ఇప్పటికైనా మారి ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టాలన్నారు. ఆమెతో పాటు మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపిపి అల్లాడ రమేష్, నాయకులు మహంతి శ్రీనువాసరావు, సర్పంచ్ టొంపల సీతారాం, దేశెట్టి గణేష్, యడ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామస్వామి హుండీ ఆదాయం రూ.26.51 లక్షలు

నెల్లిమర్ల : రామతీర్థం రామస్వామి దేవస్థానం ఆదాయం రూ.26లక్షల 51వేల 272రూపాయల వచ్చింది. గురువారం స్థానిక రామస్వామి దేవస్థానం ఆవరణలో పైడితల్లమ్మ దేవాలయం సహయ కమిషనర్ బి.హెచ్.వి.ఎస్.ఎన్. కిషోర్‌కుమార్ పర్యవేక్షణలో రామస్వామి దేవస్థానం సహాయ కమిషనర్ డి.వి.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు జరిగింది. ఈ సందర్భంగా హుండీల లెక్కింపులో 89రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని సహయ కమిషనర్ ప్రసాద్ తెలిపారు. ఈ లెక్కింపులో స్థానిక పోలీసులు, రామతీర్థం గ్రామీణ వికాస్ బ్యాంకు అధికారులు, రామతీర్థం సేవా సంఘం, విశాఖ పట్టణం, విజయనగరం, లావేరు సేవా మండలి సభ్యులు 180 మంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

విజయనగరం : నగరంలోని తోటపాలెం బొత్సపేట 1,2 అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం అర్బన్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ బి.అనురాధ పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి, శ్యామల చిన్నారులకు నేర్పిస్తున్న ఆట పాటలను తిలకించి సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని సూచించారు. అక్కడికి వచ్చిన చిన్నారుల తల్లులతో మాట్లాడి పిల్లల ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు. వయసుకు తగిన బరువు ఉన్నదీ లేనిదీ దగ్గరుండి పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చిన్నారుల ఆటపాటలను తిలకిస్తున్న సూపర్‌వైజర్ అనురాధ

గ్రామాల్లో పచ్చ దొంగలతో జాగ్రత్త

పూసపాటిరేగ.. మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

బాదుడే బాదుడు, ఇదేం కర్మ రాష్ట్రానికి అంటూ కేకలు వేసుకుంటూ గ్రామాల్లో తిరుగుతున్న పచ్చ దొంగలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్‌లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ బీమా పథకంలో మంజూరైన రూ. లక్ష నగదును రెల్లివలసకు చెందిన లెంక పార్వతికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నూతనంగా 371 పింఛన్‌లు మంజూరయ్యాయని, ఇలాంటి ముఖ్యమంత్రిని మనం గుర్తుంచుకోవాలని కోరారు. అవ్వతాతలకు, వికలాంగు, వితంతులుకు ఈ పింఛన్‌లు బరోసాగా ఉన్నాయన్నారు. ప్రతి ఏడాది పింఛన్ పెంచుకుంటూ నూతన పింఛన్‌లు అందిస్తుంటే ఎల్లో మీడియా మాత్రం పింఛన్‌లు తొలగించేస్తున్నారంటూ రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇరుకు సందుల్లో సభలు పెట్టి, డ్రోన్‌లతో షూటింగ్ చేస్తూ చంద్రబాబు నాయుడు అమాయకుల్ని బలితీసుకుంటున్నాడని ఆరోపించారు. ఆయన ఐరెన్ లెగ్ అని ఏద్దేవా చేశారు. ఎంఎల్‌సి పి. సురేస్‌బాబు మాట్లాడుతూ ఒరిస్సాలో పింఛన్ నెలకు రూ. 500 ఇస్తే మన ముఖ్యమంత్రి నెలకు రూ.2,750లు ఇస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మహంతి కళ్యాణి, జెడ్‌పిటిసి మహంతి సీతాలక్ష్మి, వైఎస్ ఎంపిపిలు అల్లాడ సత్యనారాయణమూర్తి, ఎన్. సత్యనారాయణ రాజు, మండల పార్టీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, యువజన నాయకులు మహంతి శ్రీనువాసరావు, పుప్పాల లక్ష్మినారాయణ, రామతీర్థ దేవస్థానం బోర్డు సభ్యులు డి. త్రినాదరావు, సర్పంచ్ టొంపల సీతారాం, దేశెట్టి గణేష్, యడ్ల రామకృష్ణ తదితర నాయకులు, కార్యకర్తలు, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు

గరివిడి : చీపురుపల్లి పట్టణం జెడ్‌పిటిసి కార్యాలయంలో గురువారం వైసిపి నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పతివాడ రాజారావు చేతులు మీదుగా నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింఛన్లను ఇచ్చిన మాట ప్రకారం దఫలవారీగా పెంచుతున్న ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కొరుకొండ దాలయ్య, వార్డు మెంబర్లు ఇప్పిలి కృష్ణ, గవిడి కళ్కిజీవన్, రామలింగపురం మాజీ సొసైటీ అధ్యక్షుడు రేవల్ల సత్తిబాబు, రెడ్డినీలకంఠం, స్కూల్ చైర్మన్‌లు మీసాల సీతారాం, శేఖర్ గుప్తా, శివాలయం డైరెక్టర్ ప్రభాత్ కుమార్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ద్వారా రూ.800కోట్లు నగర పంచాయతి వాసులకు ప్రయోజనం చేకూరిందని ఎంపి బెల్లాన చంద్ర శేఖర్ తెలిపారు. గురువారం నగర పంచాయతీలో కొత్తగా మంజూరైన 121 పింఛన్లను స్థానిక గాంధీ నగర్ కాలనీలో ఎంపి బెల్లాన చంద్ర శేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి.వి.వి.సూర్య నారాయణ రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పంచాయతిలో 3,617మందికి పింఛన్లు ఇస్తున్నట్లు తెలిపారు. టిడిపి పింఛన్లు తొలగించారని ప్రచారం చేసి ప్రజలను తప్పు దోవ పట్టిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతి ఛైర్మన్ బంగారు సరోజినీ, కో - ఆప్షన్ సభ్యులు చిక్కాల సాంబ శివ రావు, వైస్ ఛైర్మన్లు సముద్రపు రామారావు, కారు కొండ కృష్ణ, కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, నాగ వంశం కార్పొరేషన్, విశ్వ బ్రహ్మణ కార్పొరేషన్, రహదార్లు, భవనాలు కార్పొరేషన్ల డైరెక్టర్లు మద్దిల వాసు, జనా ప్రసాద్, నౌపాడ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు.. పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

దత్తిరాజేరు : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య చెప్పారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో నూతనంగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నవరత్నాల పేరుతో అందజేస్తున్న పథకాల ద్వారా అనేకమందికి లబ్ధిచేకూరుతుందని అన్నారు. గత ప్రభుత్వంలో పింఛను మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీ చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి, వైసిపి మండల కన్వీనర్ కడుబండి రమేష్ నాయుడు, వైస్ ఎంపిపిలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు మంత్రి అప్పలనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు సమల శ్రీనివాసరావు, నాయకులు మజ్జి అప్పలనాయుడు, మహాదేవ ఫణీంద్రుడు, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం, ఇన్‌ఛార్జి తహశీల్దార్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బాడంగి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నూతన పింఛన్లను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ పింఛన్లు మంజూరు చేస్తూ వారి సంక్షేమానికి సిఎం జగన్ అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిపిప భోగి గౌరి, జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, వైస్ ఎంపిపి బొమ్మినాయని రమేష్, ఎంపిడిఒ అక్కరావు, తహశీల్దార్ బాలమురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



బాడంగి.. పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 12 డివిజన్ గొడ్డువీధిలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న పథకాల తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అవినీతి లేకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా తమ ఖాతాలకు అందుతున్నాయని స్థానికులు సంతప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. అయితే అదే పరిస్థితుల్లో అందుతున్న పథకాలు ఏ మేరకు లబ్ధిదారులకు ఆనందాన్నిస్తున్నాయో తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. స్థానిక కార్పొరేటర్ రేగాన రూపా దేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, కోలగట్ల వీరభద్ర స్వామిని ప్రజలు ఆశీస్సులు అందించాలని కోరారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు, వైసిపి నాయకులు డొంకాడ పద్మావతి, బొంగ భానుమూర్తి, గోపి తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం : మండలంలోని జమ్మయ్యపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పనాయుడు గురువారం నిర్వహించారు. గ్రామంలో పర్యటిస్తూ ప్రభుత్వం నుంచి వచ్చిన సంక్షేమ పథకాలను వివరించారు. పేద, బడుగు, బలహీనవర్గాల, అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. మరో టీమ్‌గా మండల వైసిపి కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటికి పర్యటించారు. అనంతరం రూ. 6.50 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించారు. సక్రమంగా అంగన్వాడి నిర్వహణ చేపట్టాలని ఐసిడిఎస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండపు ఎల్లయ్యమ్మ, తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఎంపిడిఒ బంగారయ్య, హౌసింగ్ ఎఇ రాము, వైస్ ఎంపిపిలు రావాడబాబు, దాట్ల శ్రీను, కొండపు కొత్తయ్యరెడ్డి, అప్పన్న, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సుందర హరీష్, మండల నాయకులు, మండల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు గడపగడపకు వెళ్లి ప్రభుత్వం మూడేళ్ల పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాల్ నాయుడు, నాయకులు సుంకరపల్లి వాసంతి, తదితరులు పాల్గొన్నారు.

12 గంటల వరకూ తెరుచుకోని సచివాలయం

తాళం వేసి ఉన్న పాటూరు సచివాలయం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని పాటూరు గ్రామ సచివాలయం గురువారం 12 గంటల వరకూ తెరుచుకోలేదు. సచివాలయానికి సర్పంచ్ కె.వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ కె.రమణమూర్తి వెళ్లగా, తాళం వేసి ఉంది. సచివాలయ సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఎక్కడికి వెళ్లారని ఆరా తీయగా, ఎంపిడిఒ కార్యాలయంలో పాటూరు గ్రామానికి సంబంధించి సమీక్షకు హాజరైనట్లు తెలిసింది. దీంతో సర్పంచ్, ఉపసర్పంచ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. తమకు కనీస సమాచారం ఇవ్వకపోవడం దారుణమని, ప్రజాధనంతో జీతాలు తీసుకుంటూ ప్రజాప్రతినిధులను పట్టించుకోక పోవడం ఏమిటని మండిపడ్డారు. సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపిటిసికి కనీస సమాచారం లేకుండా, కేవలం పాటూరు పంచాయతీకి సంబంధించి సమీక్షను ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించడమేమిటని అధికారులను నిలదీశారు. అధికార పార్టీ నాయకులకు సేవకులుగా ఉద్యోగులు వ్యవహరించడం దారుణమన్నారు. పంచాయతీ కార్యదర్శి తీరుపై, సిబ్బందిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని వెల్లడించారు. ఈ విషయమై ఇఒపిఆర్‌డి సూర్యనారాయణను వివరణ కోరగా, సచివాలయ సిబ్బంది కార్యాలయంలో లేకపోవడం వాస్తవమేనని చెప్పారు. ఎంపిడిఒ కార్యాలయానికి సమీక్షకు వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి తెలియజేశారని వివరించారు.

పాటూరు సచివాలయ సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపిపి

సచివాలయ సిబ్బందితో సమీక్ష

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పాటూరు సచివాలయ సిబ్బందితో ఎంపిపి దొగ్గ సత్యవంతుడు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పాటూరుకు చెందిన వైసిపి నాయకులు గంగునాయుడు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

గురుకులంలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సాంఘిక సంక్షేమ బాలయోగి బాలికల గురుకులంలో సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా బాలికల కన్వీనర్ ఎం. సౌమ్య డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ బాలయోగి గురుకుల బాలికల పాఠశాలలో ఎస్ఎఫ్ఐ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా పలు సమస్యలు బృందం దృష్టికి వచ్చాయి. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ పాఠశాలలో సీటు కేటాయింపుల్లో స్థానికంగా సిబ్బంది లంచం డిమాండ్ చేయడం దారుణమన్నారు. లంచం విషయం వెలుగులోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా, అధికారులు వాటి మీద చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమని, అధికార యంత్రాంగం చేతకాని తనం కనిపిస్తుందని విమర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లంచం తీసుకున్న కంప్యూటర్ ఆపరేటర్ స్వామిని సస్పెండ్ చేయడం అభినందనీయమని, అదే సందర్భంలో పాఠశాలలో ఇటువంటి కార్యకలాపాలు జరుగుతున్న ప్రిన్సిపల్ పర్యవేక్షణ లేకపోవడం ఏమిటని విమర్శించారు. ఇంత పెద్ద పాఠశాలలో 60 మరుగుదొడ్లకు గాను ఆరు మరుగుదొడ్లే ఉపయోగంలో ఉండడం ఏంటని ప్రశ్నించారు. కనీసం మంచినీటి సదుపాయం లేకపోవడం, విద్యార్థినులతో చపాతీలు చేపించడం, వంట సదుపాయాలకు విద్యార్థులను వినియోగించడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శిలు జె రవికుమార్, ఎం వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు బి. ఉమా, బాలాజీ, నాయకులు సోమేష్, దీప్తి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సరైన ప్రణాళికతోనే పంచాయతీ అభివృద్ధి

ప్రజాశక్తి-కొత్తవలస

పంచాయతీ అభివృద్ధికి పాలకవర్గం, గ్రామస్తులు సహకరించాలని చింతలపాలెం సర్పంచ్ మాకేన సీతారామ పాత్రుడు కోరారు. మండలంలో చింతలపాలెం, వియ్యంపేట పంచాయతీల్లో గురువారం గ్రామసభలు జరిగాయి. ఈ సభల్లో సర్పంచులు సీతారామ పాత్రుడు, పులిబంటి రాము మాట్లాడుతూ సరైన ప్రణాళికల ద్వారానే పంచాయతీల అభివృద్ధి సాధ్యమన్నారు. పంచాయతీ సెక్రటరీ చిన్నారావు అభివృద్ధి పనుల వివరాలు చదివి వినిపించారు. ఈ సమావేశంలో పంచాయతీ ఉప సర్పంచ్ మజ్జి కనకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని బొద్దాం, అరిగిపాలెం, సోంపురం. జాకేరు, వీలుపర్తి, వేపాడ, వల్లంపూడి పంచాయతీల్లో గురువారం ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ ఆధ్వర్యాన గ్రామసభలు ఏర్పాటుచేశారు. గ్రామాల అభివృద్ధికి రూపొందించాల్సిన ప్రణాళికలపై ఎంపిడిఒ వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తవలస.. మాట్లాడుతున్న సర్పంచ్ సీతారామ పాత్రుడు

రేగిడి : మండలంలోని సంకిలి, బొడ్డవలస, చిన్నయ్యపేట గ్రామాల అభివృద్ధికి రూ.60 లక్షలతో సిసి రోడ్లు, కల్వర్టులు, తదితర రకాలు పనులకు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ బుడుమూరు పట్టాభి అన్నారు. ఈ మేరకు గురువారం సంకిలి సచివాలయంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి వెంకటరావు ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులతో మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ గ్రామసభలో రూ.40 లక్షలతో ఉపాధి హామీలో చెరువు పనులు, గ్రావెల్ రోడ్లు, కల్వర్టులు నిర్మించేందుకు తీర్మానం చేసినట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.20 లక్షలతో గ్రామాభివృద్ధిలో భాగంగా వీధిలైట్లు, సిసి రోడ్లు, పారిశుధ్య మెరుగు వంటి పనులకు తీర్మానం చేశామని తెలిపారు. ఇప్పటికే ఈ మూడు గ్రామాల్లో రూ.20 లక్షలతో పనులు చేపట్టామన్నారు. ఈ గ్రామ సభలో ఉప సర్పంచ్ గుండ ఫకీరు నాయుడు, ఏఎన్ఎం జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, కర్రి పోలయ్య తదితరులు ఉన్నారు.

పెద్ద శిర్లాంలో..

గ్రామాభివృద్ధే ధ్యేయంగా పెద్ద శిర్లాం గ్రామ పంచాయతీని అభివృద్ధి చేద్దామని పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసింది. గురువారం గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం సర్పంచ్, వైసిపి నాయకులు లెంకరాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. గ్రామంలో సిసి రోడ్లు నిర్మాణాలు, గృహాలు మంజూరు, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరుకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్‌తో పాటు సచివాలయం ఉద్యోగులు ఉన్నారు.

రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్‌జెడి చిన్మయిదేవి

రక్తహీనతపై అవగాహన కల్పించండి

ఐసిడిఎస్ ఆర్‌జెడి చిన్మయిదేవి

ప్రజాశక్తి-దత్తిరాజేరు

గర్భిణులు, బాలింతలు, చిన్నారులలో రక్తహీనత లోపం లేకుండా వారికి అవగాహన కల్పించాలని ఐసిడిఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి సూచించారు. మండలంలో పెదమానాపురం అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను, సరుకుల నిల్వలను పరిశీలించారు. చిన్నారులు ఎత్తుకు తగ్గ బరువులు ఉండేలా చూడాలన్నారు. గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ సేవలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంక్షేమ కార్యకర్త సత్య ధనలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు రేణుక, వాణి గణపతి పాల్గొన్నారు

రైతు ఉత్పత్తిదారుల గోదాం పరిశీలన

ప్రజాశక్తి - వంగర

మండల కేంద్రంలో నిర్మిస్తున్న రైతు ఉత్పత్తిదారుల సంస్థ గోదాంను జిల్లా ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శైలజ గురువారం పరిశీలించారు. దీనికి సంబంధించిన వివరాలను ఎపిఒ గోవిందరావును అడిగి తెలుసుకున్నారు. గోదాం నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఏదైనా సమస్య ఉంటే తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ చంద్రశేఖర్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ మండల అధ్యక్షులు గంట రామ్మోహన రావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో 8 మందికి గాయాలు

ప్రజాశక్తి - వంగర

మండలంలోని వేర్వేరు చోట్ల గురువారం జరిగిన రోడ్డుప్రమాదాల్లో 8మంది విద్యార్థులు గాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తలగంలో చెరకు లోడుతో సంకిలి షుగర్ ఫ్యాక్టరీకి వెళ్తున్న ట్రాక్టర్‌ను వంగర స్కూల్ నుంచి మడ్డువలసకు పిల్లలతో వస్తున్న ఆటో ఓవర్‌టాక్ చేయగా, అదే సమయానికి ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఆటోను ఢీకొంది. దీంతో ఆటో సమీప పొలంలో బోల్తాపడింది. అయితే ఆటో డ్రైవర్ కరణం గోవిందరావు అప్రమత్తంగా ఉండడంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు తెలిపారు. ఆటోలో ఉన్న విద్యార్థులు బురడా ప్రమీల (15), బురడా అఖిల (13), కరణం ధనుంజయ (14), ధనలక్ష్మి (15) ఆటో డ్రైవర్ గోవిందరావు, అన్నం పూజిత, రెడ్డి వాసుకు స్వల్ప గాయాలయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ సంఘటనా స్థలంలో ట్రాక్టర్ విడిచిపెట్టి పరారయ్యాడు. క్షతగాత్రు లను 108 ద్వారా రాజాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బొలెరో వాహనం ఢీకొని విద్యార్థికి గాయాలు

బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో మండలంలోని ఎం.సీతారాంపురం వసతి గృహంలో ఉంటూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి పల్ల మణికంఠకు కాళ్లకు గాయాలయ్యాయి. ఈ ఘటన ఎం.సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో జరిగింది. మణికంఠ నీరు తాగేందుకు రోడ్డు పక్కనే ఉన్న తాగునీటి బోరు వద్దకు రోడ్డు దాటుతుండగా బొలెరో వాహనం వేగంగా వచ్చి ఢీకొనడంతో గాయాల య్యాయి. వెంటనే 108లో వంగర పిహెచ్‌సికి, అక్కడి నుంచి రాజాంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయంపై వార్డెన్ సూర్యం పోలీసు లకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొలెరో డ్రైవర్ పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం గళావల్లికి చెందిన టంకాల కామేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి దూసి రాములు తెలిపారు.

గొల్జాంలో విషాదఛాయలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని గొల్జాం గ్రామస్తుల బంధువైన కోట్ని సూర్యారావు (35) విశాఖ జిల్లా పెందుర్తిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. వైసిపి జిల్లా సీనియర్ నాయకులు తూర్పాటి కృష్ణస్వామినాయుడు పెద్ద కుమార్తె కొడుకు సూర్యారావు (నరేష్) అనకాపల్లి జిల్లా మాటూరులో నివాసముంటూ ఎల్.కోట మండలంలోని గోల్డ్‌స్టార్ జంక్షన్ సమీపంలోని స్టీల్ ఎక్స్ఛేంజ్ పరిశ్రమలో ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పెందుర్తి సమీపంలో పుట్టింటి వద్ద ఉన్న భార్య, 7 నెలల కుమార్తెను చూసేందుకు నరేష్ వెళ్లారు. తిరిగి విధులకు వస్తుండగా పెందుర్తి సమీపంలో వెనుక నుంచి లారీ బలంగా ఢీకొనడంతో నరేష్ అక్కడికక్కడే మృతి చెందారు. నరేష్ మండలంలోనే ఉద్యోగం చేయడంతోపాటు ఎక్కువగా గొల్జాం గ్రామంలో గడిపేవారు. నరేష్ మరణవార్త తెలియడంతో గొల్జాంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహానికి కెజిహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి, స్వగ్రామం అనకాపల్లి జిల్లా మాటూరుకు తరలించారు.